# ★ కళారాధన ★

శ్రీ కన్నెకంటి ప్రభాకరశాస్త్రి

*   *   *   *   *   *   *

"సుజాతా – ఈనాటికి మనకష్టాలు గట్టెక్కినవి" అన్నాడు యింట్లో అడుగు పెడుతూనే రాజు. 'ఏమిటండీ' అన్నది ఆత్రుతతో తన విశాలమైన కళ్ళను త్రిప్పుతూ. 'మన చయిర్మను, ఆయన చిత్రాన్ని చిత్రించమని చెపుతూ వెయినూట పదహార్లు యిస్తానని వాగ్దానంగూడా చేశాడు' అన్నాడు రాజు ఆనందంతో. 'నిజంగానటండీ – ఆ స్వామికి ఈనాడు మనపై కనికరం కలిగింది' అన్నది సుజాత. 'అవును సుజాతా – నిన్ను కొత్తపచ్చచీర, నల్లని రవికెతో అలంకరించాలనిఉంది సుజాతా' అన్నాడు రాజు. 'మీరు ఎంత అమాయకులండి...మీ హృదయంలో నేను లేనా! మీ అనురాగంకన్న నాకు కావలసినదేముంది?'

''అంతేలే సుజాతా... లేకపోతే మన కోరికలెట్లా తీరుతవి... అందరివలెనే నిన్నూ కూర్చోబెట్టి సర్వాంగ సుందరంగా అలంకరింపజేసి అన్ని సుఖాలు అనుభవింపజేయాలని ఆశపడతాను... నీకోర్కెలను తీర్చుతూ నీ సున్నితమైన చేతులను సుమసమానంగా ఉంచుదామనుకొంటాను ... నిజంగా నా అదృష్టంకొద్ది లభించావు సుజా .... నిన్ను వివాహమాడి నేనైతే ధన్యుణ్ణయ్యాను కాని ... '' అని ఆగిపోయాడు రాజు.

'ఆగండి ... ఏమిటామాటలు. భర్త అనురాగంకన్న స్త్రీకోరేదేముంటుంది ఈ ప్రపంచంలో,...ప్రసిద్ధచిత్రకారుడైన భర్తను పొందాను. వారికి ప్రేమపాత్రురాలనయ్యాను. నాకు మిమ్ములను భర్తగా కూర్చినందుకు భగవంతుని ప్రార్థించని రోజులేదు. మీ ఉద్దేశము మనము బీద వాళ్ళమనిగదూ! ధనము శాశ్వతమా?'

'అవును. అలానుకొని సరిపెట్టుకోవాలి; లేక చేయగలిగిందేముంది చెప్పు. ధనవంతులందరూ కార్లలో తిరుగుతూ భవనాలలో నివశిస్తుంటే ఈ కష్టపడటంకన్న చేసేదేముంది. ఈ వేదాంతమే లేకపోతే సగము మానవజాతి భాగ్యవంతుల మేడలను పగులగొట్టేదేమో!'

'ఊరుకోండి ఏమిటాధోరణి' రండి భోంచేద్దురుగాని!'

'భోజనమా...నీవు తినకుండా నేనెలా తినను చెప్పు? ఈ విధంగాఒకపూట పస్తుతో ఎన్నాళ్లు బ్రతుకుతాము, చూడబోతే ప్రపంచంనుండి ఎందరో అభినందన పత్రాలు, లేఖలు పంపుతారు. నీవు ధన్యుడవంటారు.

వాళ్ల పరిభాషలో ధన్యత అంటే యిదేనేమో! మనపరిస్థితి ఈ విధంగా ఉంటుండి నీవు తినంది నేను తినను... నేనేమి చిన్న పిల్లవాడినా చెప్పు, తింటే ఉన్నదే యిద్దరము తిందాము'

'సరే ... లేవండి'

♦ ♦ ♦

"ఏమండీ, ఏమిటిది, బ్రతకడానికేనా, ఎప్పుడీలా రంగులతో మునిగి తేలుతుంటే ఆరోగ్యం చెడిపోదూ ?"

'అదేమిటి సుజాతా ? చిత్రం పూర్తిచేసి వెయ్యిరూపాయిలు సంపాదించాలి ఈ రాత్రికి పూర్తిచేసి రేపు తీసికొనిపోతాను...'

'రాత్రంతా మేలుకుంటూరా ! వద్దండి, నా మాట వినండి; అన్ని చెప్పి చేయించే వారేకాని, రేపు మూలపడితే ఎవరూ ఆదుకోరు ... నేనూరుకోను, నా మాట వినండి, మీపాదాలుపట్టుకుంటాను. ఎంతో చిక్కిపోయ్యారు, నేనేం పాపం చేశానండి నా మాట వినకుండా ఉండటానికి...'

'తప్పు సుజాతా! నాకు మాత్రం నా ఆరోగ్యం కాపాడుకోవాలని లేదా ! ఎన్ని రోజు లీలా అర్ధాకలితో జీవిస్తాం చెప్పు! ! ఈ చిత్రాన్ని పూర్తిచేసి మన ఆకలి తీర్చుకోవాలనేగాని ... ఏడవకు సుజాతా ... ఈ దౌర్భాగ్యుని కట్టుకున్నతరువాత ఈ మాత్రానికే ఏడుస్తే...'

'ఆగండీ, బాధపడ్డారా, క్షమించండి... సరే! కానీయండీ నేనుగూడా మేలుకుంటాను, చిత్రం పూర్తిచెయ్యండి.'

రాజు తన చిత్రాన్ని పూర్తిచేశాడు, ఇక దృష్టి పెట్టటము మాత్రమే మిగిలింది, సుజాత ముఖంలో చిరునవ్వు మెరిసింది, నెమ్మదిగా మెడచుట్టూ చేతులుచుట్టి ముఖంలో ముఖంపెట్టి' ... ... నిజంగా యింత చక్కగా ఏలా వ్రాశారు, మీరు గొప్ప చిత్రకారులు.'

"ఓహో - నీవుకూడా అభినందనల నేనా,...యింకా ఏమన్నా ఇస్తావనుకున్నాను" అంటూ ఆమెను బాహులతా పంజరంలో బంధించాడు, విధాత తిన తిండిలేని నవదంపతుల మధ్య అనురాగ ప్రవాహాన్ని కల్పించి ఈ జీవిత నాటకాన్ని రక్తి కట్టిస్తాడు కాబోలు! లేకపోతే సిరీష సుమబాల సుజాత ఏజమీందారీ కుటుంబంలోనో ఉండవలసిన యువతి. ఆమెకు సౌందర్యం, సౌశీల్యం రెండూ ఉన్నవి. యిక రాజు, ప్రపంచ ప్రసిద్ధి వడసి నవయువక చిత్రకారుడు...

ఇంతలో ప్రమిదలో నూనె అయిపోయింది, అతని కుంచె ఆగిపోయింది, సుజాత కునికిపాట్లుపడుతూఉంది, 'సుజాతా' అన్నాడు రాజు, ఆమెలేచి దీపాన్ని చూచింది. కాని యింట్లో నూనెలేదు. 'చిత్రం పూర్తయిందిలే సుజాతా' అన్నాడు రాజు భయంతో ... ఈ సమయంలో అంతరాయం కలిగిస్తే చిత్రం చెడిపోతుం

దని తన పవిటచెరగును చింపుతూ ఒత్తులుగా చేసివేసింది. చిత్రం పూర్తయింది, తెలతెలవారింది, ఆమె పవిట సగము వత్తిగా కాలిపోయింది.

◆ ◆ ◆

సూర్యకిరణాలతో పాటు రాజు ముఖంలో ఆనందరేఖలు ఉద్భవించాయి, కొద్దికాలంలోనే అతడు వెయినూట పదహార్లకు అధికారి కాబోతున్నాడు, సుజాత చిత్రాన్ని అందిస్తూ చిరునవ్వు నవ్వింది, రాజు చెయిర్ మన్ గారింటికి వెళ్ళాడు, కాఫీ త్రాగి కూర్చున్న చెయిర్ మన్ దామోదరయ్య 'ఓ ఎవరూ...రాజూ...రా...చిత్రం కూడా పూర్తిచేసినట్లుందే ... నిజంగా నీవు గొప్ప చిత్రకారుడివి ... ఈ పట్టణం తరఫున నీకు సన్మానంచేద్దామనుకుంటున్నాను; అప్పుడు కనీసం వెయినూట పదహార్లన్నా గిడతయి'

రాజు కూర్చుంటూ 'చిత్రం చూస్తారా' అన్నాడు.

'చిత్రం చూచేదేమిటి ... నీవు వేస్తే యిక చూడాలా, అక్కడపెట్టు. త్వరలోనే నీకు సన్మానసభ ఏర్పాటుచేస్తాను ... సరేనా, కనపడుతూండు'

రాజుకు ఈ మాటలలోని ఆంతర్యం అర్థంకాలేదు, అతని గుండె దడదడలాడింది. కాళ్లక్రింద భూమి కృంగినట్లనిపించింది, నెమ్మదిగా "మరి నా మాటేమిటండీ" అన్నాడు.

"అదే చెప్పానుకదూ, త్వరలోనే ఏర్పాటు చేస్తానన్నానుకదూ !"

"అదికాదండి ఈచిత్రం గీచినందుకూ"

"అయితే దీనికి విలువ యిమ్మంటున్నావన్నమాట"

"అవునండి – నా పరిస్థితి మీకు తెలియందికాదుగదా! చాలా చిక్కులలో ఉన్నాను – ఎంతో ఆశతో వచ్చాను."

"అయితే డబ్బుల కమ్ముకుంటా వటయ్యా నీ శక్తిని, సరిగా గీచావా, చూపించు." రాజు సంతోషంతో చిత్రాన్ని చూపించాడు.

"అదేమిటి రాజు ఆ పన్ను పెదవిమీద! వేశావు, అసహ్యంగా లేదూ!"

"అవును, మీరు అలానే ఉన్నారు కదండీ –"

"అట్లా ఉంటే అట్లా గీచావన్నమాట, నీ వేదో అందంగా గీస్తావనుకున్నాను, ఈ మాత్రానికే నీకు కానుకలివ్వాలా, హాయిగ ఫోటో తీయించుకోనా ? సరేలే ... నీ చిత్రంవద్దూ, ఏమీవద్దు, నేను పనుండిపోతున్నాను" అంటూ కారులో ఎక్కి వెళ్లిపోయాడు. రాజు చిత్రంతో తన యింట్లోకి ప్రవేశించాడు. సుజాత అంతా గ్రహించింది. రాజు వస్తూన్న దుఃఖాన్ని ఆపుకుంటూ అంతా చెప్పాడు. చంటివాడిలా సుజాతఒడిలో వ్రాలిపోయాడు, సుజాత బుజ్జగిస్తూ 'ఎందుకండీ బాధపడటం ... మన లలాట లిఖితం ఈలావుంటే వారికి మంచి బుద్ధి పుడుతుందా! కళారాధకుల జీవితాలింతేగామోను' అన్నది సుజాత గిరబోయిన కంఠంతో.